ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
గురువారం, 15 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 55 | పేజీలు: 4 వెల: 5



# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపులు
- మూడేళ్లలో రూ.1,64,431 కోట్లు నేరుగా ఖాతాల్లోకి జమ
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయింపు
- అచ్చంపేటను ప్రధాన జంక్షన్‌గా తీర్చిదిద్దుతాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**కాకతీయ, అచ్చంపేట :**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందని కుటుంబం లేదని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,64,431 కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేశామని వెల్లడించారు. ఈ లెక్కలపై ఎవరితోనైనా చర్చించేందుకు, ఎలాంటి సవాల్‌నైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అచ్చంపేట నియోజకవర్గంలో రూ.74.82 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఆయన, మన్ననూరులో 220/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు గాను కోటి 6 లక్షల కుటుంబాలు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్యసాయం అందిస్తున్నామని చెప్పారు. 43 లక్షల కుటుంబాలకు పింఛన్లు, 71.40 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద ప్రతి సీజన్‌కు ఎకరానికి రూ.6 వేల చొప్పున సాయం అందిస్తున్నట్లు వివరించారు. 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు

........(తరువాయి 2లో)



# ఇండియా కూటమి సమరశంఖం

## హైదరాబాద్ వేదికగా 24న భారీ బహిరంగ సభ

- సభలో పాల్గొననున్న జాతీయ నేత రాహుల్ గాంధీ
- ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్త ఉద్యమానికి కార్యాచరణ
- తెలంగాణలో పార్టీ శ్రేణుల సమీకరణపై దృష్టి
- ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ఉద్యమాన్ని విస్తరించడమే లక్ష్యం
- రాష్ట్రంలో పార్టీని మరింతగా పటిష్టం చేసేందుకు వ్యూహం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :**

ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను కేంద్రంగా చేసుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి రాజకీయ పోరుకు సిద్ధమవుతోంది. అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయన్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తోంది. ఈ నెల 24న సభ నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సుమారు లక్ష మందిని సమీకరించడమే

........(తరువాయి 2లో)

# స్టార్‌లింక్ కంటే మేమే ముందున్నాం

- ఐదేళ్ల క్రితమే అనుమతులకు దరఖాస్తు చేసుకున్నాం
- మూడేళ్లుగా కేబుల్ నెట్‌వర్క్‌కు సిద్ధం
- తుది భద్రతా అనుమతుల కోసం ఎదురుచూపులు
- టెలికాం సేవలపై పన్నులు తగ్గించాలి
- చైనా సరఫరాలపై ఆధారపడటం తగ్గించాలి
- భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ మిత్తల్



**కాకతీయ, నేషనల్ డెస్క్ :** శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవల అనుమతుల విషయంలో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంటే తమ సంస్థ ముందంజలో ఉందని భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సునీల్ భారతీ మిత్తల్ స్పష్టం చేశారు. ఐదేళ్ల క్రితమే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నామని, మూడేళ్లుగా భూఆధారిత నెట్‌వర్క్‌ను సిద్ధంగా ఉంచామని తెలిపారు. దిల్లీలో జరుగుతున్న బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత భూభాగంపై తమ శాటిలైట్లు ఐదేళ్లుగా తిరుగుతున్నాయని మిత్తల్ వెల్లడించారు. శాటిలైట్ కనెక్టివిటీ సేవలను ప్రారంభించేందుకు తమ సంస్థ సిద్ధంగా

........(తరువాయి 2లో)



# భారతీయ సంస్కృతికి ప్రపంచవ్యాప్త గుర్తింపు

- సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలతో దేశాలకు దగ్గరవుతున్న భారత్
- పురాతన కళాఖండాల పునరుద్ధరణకు కొత్త ఊపు
- 'జ్ఞాన్ భారతం'తో తాళపత్రాల వారసత్వ పరిరక్షణ
- అంతర్జాతీయ సదస్సుకు పంపిన లేఖలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** భారతదేశ సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలు ప్రపంచవ్యాప్తంగా వివిధ సమాజాలను అనుసంధానిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వీటి ద్వారా భారతీయ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని పేర్కొన్నారు. చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు 'జ్ఞాన్ భారతం' కార్యక్రమం ద్వారా పురాతన తాళపత్రాల వారసత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్: ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై

........(తరువాయి 2లో)

### 3 ట్రిలియన్ డాలర్ల

# ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

## 2047 నాటికి తెలంగాణ సాధించే దిశగా అడుగులు

- పెట్టుబడులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- యువత, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- సమాఖ్య బిజినెస్ సమ్మిట్–2026లో సీఎం రేవంత్‌రెడ్డి



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :**

తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026 ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, ఆధునిక కాలంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడానికి సమాఖ్యలు కీలకమని పేర్కొన్నారు. కొత్త తరం అభివృద్ధికి వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. సినిమా, రాజకీయ రంగాల్లో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు వివిధ హోదాల్లో రాణించి, ఇతరులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. వారి విజయగాథలను సమాఖ్య భద్రపరిచి యువతకు అందించాలని సూచించారు.

**తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యం**

2047 నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతాయని, అప్పటికి వికసిత్ భారత్ సాధించాలన్న ప్రధానమంత్రి

........(తరువాయి 2లో)

## విదేశీ మద్యం ధరలు పెంపు

- ఫుల్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.100 వరకు పెంపు
- సగటున 6 శాతం మేర ధరల సవరణ
- 352 విదేశీ మద్యం బ్రాండ్ల ధరలకు మార్పులు
- అక్టోబర్ 12 నుంచే కొత్త ధరలు అమల్లోకి
- సవరించిన ధరలతోనే విక్రయాలు జరపాలని ప్రభుత్వం ఆదేశాలు



2

## బ్లూ డ్రమ్ హత్య కేసులో సంచలన తీర్పు

- భర్త హత్య కేసులో భార్య, ప్రియుడికి ఉరిశిక్ష
- మృతదేహాన్ని ముక్కలుగా చేసి డ్రమ్‌లో సిమెంట్‌తో పూడ్చిన వైనం
- 126 విచారణలు.. 22 మంది సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా తీర్పు



2

# సర్వే నంబర్ల మాయాజాలం!

ఒకే స్థలానికి రెండు సర్వే నంబర్లు.. ఒకే వ్యవహారంపై అధికారుల నుంచి పరస్పర విరుద్ధమైన సంకేతాలు.. 2021లో తప్పుగా నిర్ధారించి రద్దు చేసిన నంబర్ మళ్లీ తెరపైకి రావడం.. 12 ఏళ్లుగా ఒకే కార్యాలయంలో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్ పాత్రపై అనుమానాలు.. ఇవన్నీ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని వివాదాల్లోకి నెడుతున్నాయి. పైడిపల్లి శివారు కత్తెరశాల లక్ష్మీకాంత్ కాలనీలోని 600 గజాల స్థల వివాదం ఇప్పుడు తీవ్ర రూపం దాల్చింది. సర్వే నంబర్ 624/1/2కు చెందిన స్థలాన్ని 527/బి కింద చూపించడంపై బాధితులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఈ గందరగోళం మధ్య తమ స్థలంలోకి డోజర్ తీసుకొచ్చి గోడలు కూల్చివేశారని ఓ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం కేసు దాకా వెళ్లింది. దీనిపై 'ఉత్తరం కాకతీయ' గతంలో వరుస కథనాలు ప్రచురించినా సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం. - కాకతీయ, వరంగల్ ప్రతినిధి



- కాశీబుగ్గలో 624ను 527గా మార్చిందెవరు?
- ఏడీ సర్వే ఒకటి.. డీసీ నోటీసు మరొకటి
- 2021లో రద్దయిన నంబర్ మళ్లీ తెరపైకి ఎలా?
- 12 ఏళ్లుగా ఒకే సర్కిల్‌లో ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్
- అధికారుల డిజిటల్ కీలన్నీ ఆయన చేతిలోనేనా?
- లక్ష్మీకాంత్ కాలనీలో డోజర్ కలకలం.. కేసు నమోదు

3

# విదేశీ మద్యం ధరలు పెంపు

- ఫుల్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.100 వరకు పెంపు
- సగటున 6 శాతం మేర ధరల సవరణ
- 352 విదేశీ మద్యం బ్రాండ్ల ధరలకు మార్పులు
- అక్టోబర్ 12 నుంచే కొత్త ధరలు అమల్లోకి
- సవరించిన ధరలతోనే విక్రయాలు జరపాలని ప్రభుత్వం ఆదేశాలు



**కాకతీయ,తెలంగాణ బ్యూరో** : తెలంగాణలో విదేశీ మద్యం ధరలు పెరిగాయి. బ్రాండ్‌ను బట్టి ఫుల్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.100 వరకు ధరలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సగటున 6 శాతం మేర ధరలను సవరించింది. ఇప్పటికే విక్రయిస్తున్న 352 విదేశీ మద్యం బ్రాండ్ల ధరలను సమీక్షించిన ప్రభుత్వం, టెండర్ కమిటీ సమర్పించిన నివేదిక, సిఫారసుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 12 నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చినట్లు అధికారిక సర్క్యులర్ జారీ అయింది. దీంతో విదేశీ మద్యం కొనుగోలుదారులపై అదనపు భారం పడనుంది. రాష్ట్రంలో విక్రయిస్తున్న అన్ని విదేశీ మద్యం బ్రాండ్లకు ఒకే విధంగా ధరలు పెంచకుండా, బ్రాండ్‌ను బట్టి సవరణలు చేపట్టారు. ఫుల్ బాటిల్‌పై కనిష్ఠంగా రూ.30, గరిష్ఠంగా రూ.100 వరకు పెంపు ఉన్నట్లు తాజా ధరల వివరాలు సూచిస్తున్నాయి. సగటున 6 శాతం మేర ధరలు పెరగడంతో వినియోగదారులు ఇకపై ఆయా బ్రాండ్లను కొనుగోలు చేసేందుకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

**ప్రీమియం బ్రాండ్లపై అదనపు భారం**

ప్రధానంగా స్కాచ్, సింగిల్ మాల్ట్ విస్కీలు, ప్రీమియం వోడ్కా, జిన్, వైన్ వంటి దిగుమతి బ్రాండ్ల ధరల్లో పెంపు చోటుచేసుకుంది. మద్యం ధరల పెంపుపై కొంతకాలంగా చర్చలు జరుగుతుండగా, ప్రభుత్వం తాజాగా ధరల సవరణకు ఆమోదం తెలిపింది. టెండర్ కమిటీ నివేదికను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, ఒక్కో బ్రాండ్‌కు సంబంధించిన పాత ధర, కొత్త ధరల పూర్తి వివరాలు అందుబాటులో ఉన్న ధరల జాబితా ఆధారంగా పరిశీలించాల్సి ఉంటుంది.

**కొత్త ధరల ప్రకారమే విక్రయాలు**

అక్టోబర్ 12 నుంచి డిపోల ద్వారా సరఫరా చేసే ప్రతి స్టాక్‌పై సవరించిన గరిష్ఠ చిల్లర ధరల స్టిక్కర్లు తప్పనిసరిగా వేయాలని తెలంగాణ రాష్ట్ర పానీయాల సంస్థ డిపో మేనేజర్లను ఆదేశించింది. వైన్స్, బార్ల యజమానులు కూడా కొత్త ధరల జాబితా ప్రకారమే విక్రయాలు జరపాలని స్పష్టం చేసింది. వినియోగదారులు మద్యం కొనుగోలు చేసే ముందు బాటిల్‌పై ముద్రించిన తాజా గరిష్ఠ చిల్లర ధరను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. పాత ధరలతో విక్రయాలు జరగకుండా సవరించిన ధరల అమలుపై సంబంధిత యంత్రాంగం దృష్టి సారించింది.

# బ్లూ డ్రమ్ హత్య కేసులో సంచలన తీర్పు

- భర్త హత్య కేసులో భార్య, ప్రియుడికి ఉరిశిక్ష
- మృతదేహాన్ని ముక్కలుగా చేసి డ్రమ్‌లో సిమెంట్‌తో పూడ్చిన వైనం
- 126 విచారణలు.. 22 మంది సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా తీర్పు



**కాకతీయ, నేషనల్ డెస్క్** : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బ్లూ డ్రమ్ హత్య కేసులో మేరఠ్ జిల్లా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. భర్త సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా చేసి నీలిరంగు డ్రమ్‌లో ఉంచి సిమెంట్‌తో పూడ్చిపెట్టిన కేసులో భార్య ముస్కాన్ రస్తోగీ, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాలకు ఉరిశిక్ష విధించింది. నిందితులిద్దరూ క్షమించరాని నేరానికి పాల్పడ్డారని జిల్లా న్యాయమూర్తి అరవింద్ కుమార్ మిశ్రా తీర్పులో పేర్కొన్నట్లు అందించిన సమాచారం వెల్లడిస్తోంది. సెప్టెంబరు 30న నిందితులను దోషులుగా తేల్చిన కోర్టు, బుధవారం తుది విచారణ అనంతరం శిక్ష ఖరారు చేసింది. భద్రతా కారణాలతో ఇద్దరినీ జైలు నుంచి వర్చువల్ విధానంలో కోర్టు ఎదుట హాజరుపరిచారు. సుమారు ఏడాదిన్నర పాటు సాగిన విచారణలో ప్రాసిక్యూషన్ 126 విచారణలు నిర్వహించగా, సుమారు 22 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు సమాచారం. హత్యతో పాటు సాక్ష్యాలను ధ్వంసం చేసిన తీరుపై కోర్టు తీవ్రంగా స్పందించింది. నిందితులిద్దరికీ ఉరిశిక్ష విధించడంతో పాటు వివిధ సెక్షన్ల కింద రూ.20 వేల జరిమానా కూడా విధించింది. తీర్పుపై సౌరభ్ రాజ్‌పుత్ తల్లి రేణు దేవి హర్షం వ్యక్తం చేశారు. తన కుమారుడిని హత్య చేసిన వారికి మరణశిక్ష విధించడంతో న్యాయం జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. కేసు విచారణలో సహకరించిన న్యాయవాదులు, సహోద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. దాంపత్య జీవితంలో సమస్యలు ఎదురైతే విడిపోవడమే మార్గమని, ప్రాణాలు తీసేంతటి దారుణాలకు పాల్పడకూడదని ఆమె పేర్కొన్నారు.

# భారతీయ సంస్కృతికి ప్రపంచవ్యాప్త గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)



అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ప్రధాని సందేశాన్ని చదివి వినిపించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పాల్గొన్నారు.

**సరిహద్దులకు అతీతంగా భారతీయ నాగరికత**

విదేశాల నుంచి పురాతన భారతీయ కళాఖండాలను తిరిగి తీసుకువచ్చే ప్రయత్నాలు కొత్త ఊపును అందుకున్నాయని మోదీ పేర్కొన్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతోందని తెలిపారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సరిహద్దులకు అతీతంగా విస్తరించిన నాగరికతా సంబంధాల ఇతివృత్తంతో ఈ సదస్సు జరుగుతోంది. కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ దీనిని నిర్వహిస్తోంది. ప్రపంచంతో భారత్‌కు ఉన్న చారిత్రక, సమకాలీన సాంస్కృతిక సంబంధాలపై చర్చించేందుకు వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు హాజరవుతున్నారు. ఈ సదస్సు గ్రేటర్ ఇండియా సొసైటీ శతజయంతి ఉత్సవాలకు కూడా వేదికగా నిలిచింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో 1926 అక్టోబర్ 14న అప్పటి కలకత్తాలో భారతీయ పండితుల బృందం ఈ సంస్థను స్థాపించినట్లు ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ తెలిపింది. భారతీయ సంస్కృతి, నాగరికత ప్రపంచంలోని వివిధ ప్రాంతాలతో ఏర్పరచుకున్న సంబంధాలను పరిశీలించేందుకు ఈ సదస్సు దోహదపడుతోంది.

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించామని, అచ్చంపేటలో 7,300 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని, 12 లక్షల మంది కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కొనసాగుతోందని చెప్పారు. నవంబర్ 19న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ప్రకటించారు.

**వనరుల ఆధారంగా జిల్లాల అభివృద్ధి**

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని, హైదరాబాద్‌కే అభివృద్ధిని పరిమితం చేయకుండా ప్రతి జిల్లా వనరుల ఆధారంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. అచ్చంపేటతో 1980 నుంచి తనకు అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. నియోజకవర్గంలో 1,219 విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 403 కిలోమీటర్ల విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసి, 5 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.75 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. మన్ననూరు, నల్లమల అటవీ ప్రాంతాల్లో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసి గిరిజన కుటుంబాలు, రైతులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో 42 గ్రామాల్లో 130 కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకున్నామని, పెన్షన్లు, పోడు భూములు, విద్యుత్, సాగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పనులు, నక్కలగండి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపైనా దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# స్టార్‌లింక్ కంటే మేమే ముందున్నాం

(మొదటిపేజీ తరువాయి)



ఉందని, ప్రస్తుతం తుది భద్రతా అనుమతుల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. అనుమతులు లభిస్తే సంప్రదాయ నెట్‌వర్క్‌ల ద్వారా చేరుకోవడం కష్టమైన ప్రాంతాలతో సహా దేశవ్యాప్తంగా సేవలను విస్తరించగలమని ధీమా వ్యక్తం చేశారు. ఆఫ్రికాలో ఇప్పటికే అంతర్జాతీయ సంస్థతో కలిసి శాటిలైట్ సేవలను ప్రారంభించిన అనుభవం తమకు ఉందని గుర్తుచేశారు.

**డిజిటల్ సేవలపై పన్నులు తగ్గించాలి**

ఆర్థిక వృద్ధికి డిజిటల్ మౌలిక సదుపాయాలు కీలకమని మిత్తల్ పేర్కొన్నారు. డిజిటల్ సాంకేతికత ఆర్థిక వ్యవస్థకు ఉత్ప్రేరకంగా పనిచేయాలంటే డిజిటల్ వస్తువులు, టెలికాం సేవలపై పన్నులను వీలైనంత తగ్గించాలని అభిప్రాయపడ్డారు. ఔషధ ముడిపదార్థాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో చైనా ఆధిపత్యం పెరిగిందని మిత్తల్ పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేయడంతో ప్రపంచ దేశాలు చైనా సరఫరాలపై ఆధారపడ్డాయని చెప్పారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఆధారపడటం సమస్యగా మారుతోందన్నారు. సరఫరా గొలుసులను వైవిధ్యపరచడం అవసరమని, అయితే ఈ మార్పునకు సమయం పడుతుందని వివరించారు. చైనాతో వాణిజ్య లోటు ఉన్న దేశాలు ఆ దేశ సరఫరాలపై ఆధారపడుతూ లోటును తగ్గించుకోవడం కష్టమని పేర్కొన్నారు.

**ఏఐ నియంత్రణపై తక్షణ చర్యలు అవసరం**

కృత్రిమ మేధ సాంకేతికత అభివృద్ధి ప్రభుత్వాల నిబంధనల రూపకల్పన కంటే వేగంగా సాగుతోందని మిత్తల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ వినియోగానికి సంబంధించిన నియమాలు, రక్షణ చర్యలపై భారత్ సంప్రదింపుల పత్రాన్ని సిద్ధం చేస్తోందని తెలిపారు. ఏఐ ఏజెంట్లు నిర్దేశిత నియంత్రణలను దాటి పనిచేసే ప్రమాదం ఉందని, ఇటువంటి హెచ్చరికలను ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలని కోరారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)



నరేంద్ర మోదీ లక్ష్యానికి రాష్ట్రాల సహకారం అవసరమని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు తప్ప అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. ఈ దిశగా 2025లో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం దేశ స్థూల జాతీయోత్పత్తిలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, దాన్ని 10 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని మూడు ఆర్థిక ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా అభివృద్ధి చేస్తూ ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్)గా తీర్చిదిద్ది తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలను రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్)గా అభివృద్ధి చేస్తూ వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం**

మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా బలపడుతున్నాయని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మహిళలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల నిర్వహణలో మహిళలను యజమానులుగా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. యువతతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సూచించారు. ఇందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. గతంలో చార్మినార్ హైదరాబాద్‌కు గుర్తింపుగా నిలిస్తే, ప్రస్తుతం హైటెక్ సిటీ వ్యాపార, పారిశ్రామిక రంగాలకు గుర్తింపుగా మారిందని రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానిక పారిశ్రామికవేత్తలు కేవలం కార్పొరేట్ సంస్థలకు సేవలందించడానికే పరిమితం కాకుండా సొంతంగా పెట్టుబడులు పెట్టి ప్రపంచ స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. నూతన పారిశ్రామిక విధానంలో అందరూ భాగస్వాములు కావాలని, పెట్టుబడులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని కోరారు.

# 18 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్య సేవలు

- పెనుగోలు కొండపై వైద్య శిబిరం
- ఇద్దరికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ
- మారుమూల గిరిజనులకు వైద్య సిబ్బంది సేవలు



**కాకతీయ, ఏటూరునాగారం** : మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేక చొరవ చూపారు. వాజేడు మండలంలోని పెనుగోలు కొండపై వైద్య శిబిరం నిర్వహించేందుకు గుమ్మడిదొడ్డి గ్రామం నుంచి సుమారు 18 కిలోమీటర్లు దట్టమైన అటవీ మార్గంలో కాలినడకన ప్రయాణించారు. వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో రాకపోకలకు కలిపి 36 కిలోమీటర్లు నడిచి గిరిజనులకు వైద్య సేవలు అందించారు. పెనుగోలు కొండపై 10 ఇళ్లు, 36 మంది జనాభా ఉండగా, 25 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. వీరిలో బొగ్గుల సత్యం (42), ఉయిక రాధ (45)కు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణైంది. వైద్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని ఇళ్లలో మలేరియా నివారణ మందులను పిచికారీ చేశారు. అలాగే ప్రతి కుటుంబానికి ఒక దుప్పటిని కే. శ్రీనివాసరావు తన సొంత ఖర్చులతో అందజేశారు. ఈ శిబిరంలో కే. శ్రీనివాసరావు, కే. చిన్న వెంకటేశ్, కే. శేఖర్, బి. లఖన్ పాల్గొనగా, బుంజగరావు, హిమామ్ సహకరించారు. మారుమూల ప్రాంతాల్లోనూ వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది చూపిన చొరవపై ఏజెన్సీ వాసులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి..

- నిందితుల అరెస్టుపై ప్రత్యేక దృష్టి సారించాలి..
- బతుకమ్మ, దసరా పండుగలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి..

**కాకతీయ, వరంగల్ బ్యూరో:** పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల స్థితిగతులపై సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా నాణ్యతతో కూడిన విచారణను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, తీవ్రమైన నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి కేసులో చట్ట నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రానున్న బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధారా కవిత, అదనపు డీసీపీలు రాయల ప్రభాకర్ రావు, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, పలువురు సీఐలు, ఎస్సైలు, ఐటీ కోర్ అధికారులు పాల్గొన్నారు.

# ఇండియా కూటమి సమరశంఖం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఏర్పాట్లపై దృష్టి సారిస్తోంది. జాతీయ స్థాయిలో ఓటర్ల జాబితాల అంశాన్ని ప్రధాన రాజకీయ చర్చగా మార్చడంతో పాటు తెలంగాణలో పార్టీ శ్రేణులను సమీకరించడం, కూటమి ఐక్యతను చాటడం ఈ సభ వెనుక ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇండియా కూటమిలోని ఇతర జాతీయ స్థాయి నాయకులను కూడా ఆహ్వానించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. జాతీయ నేతల సమక్షంలో సభ నిర్వహించడం ద్వారా ఓటర్ల జాబితాల అంశానికి దేశవ్యాప్త ప్రాధాన్యం కల్పించడంతో పాటు విపక్షాల ఉమ్మడి కార్యాచరణను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే నేతల పర్యటనలు, సభా వేదిక, సమయం వంటి వివరాలపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**లక్ష మందితో జనసమీకరణకు కసరత్తు**

సభకు సుమారు లక్ష మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం జనసమీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పార్టీ శ్రేణులను సమీకరించడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నాయకుల పర్యటనలను సమన్వయం చేయడం వంటి అంశాలపై కసరత్తు సాగుతున్నట్లు సమాచారం. భారీ సభకు అనుగుణంగా రవాణా, వాహనాల పార్కింగ్, భద్రత, ఇతర సౌకర్యాల ఏర్పాట్లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. పార్టీ బలాన్ని ప్రదర్శించడంతో పాటు ఓటర్ల జాబితాల అంశంపై ప్రజల్లో చర్చ పెంచడం ఈ కార్యక్రమం ద్వారా సాధించాలని నాయకత్వం భావిస్తోంది. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌తో పాటు హైదరాబాద్‌లోని ఇతర అనువైన ప్రదేశాలను సభా వేదికగా పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. లక్షల సంఖ్యలో కాకుండా సుమారు లక్ష మంది హాజరయ్యేలా ప్రణాళిక రూపొందిస్తున్న నేపథ్యంలో ప్రజలకు రాకపోకలు సులభంగా ఉండే ప్రాంతాన్ని ఎంపిక చేయాల్సి ఉంది. వేదిక ఖరారు, అనుమతులు, భద్రతా ఏర్పాట్లు, జాతీయ నాయకుల పర్యటనల షెడ్యూల్ వంటి అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాతే సభ నిర్వహణపై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**హైదరాబాద్‌కు ఉద్యమ విస్తరణ**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆ హక్కు అందుబాటులో ఉండేలా ఎన్నికల వ్యవస్థ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఓటర్ల జాబితాలపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు పారదర్శకత అవసరమని విపక్ష నేతలు వాదిస్తున్నారు. మరోవైపు ఈ ఆరోపణలకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారిక రికార్డులు, వివరణల ఆధారంగా వాస్తవాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయినప్పటికీ, ఓటర్ల జాబితాల అంశం ప్రస్తుతం విపక్షాల రాజకీయ ఉద్యమంలో ప్రధాన అజెండాగా మారింది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపును అడ్డుకోవాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలని కోరుతున్నారు. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను పదవి నుంచి తొలగించాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిలిపివేయాలన్న డిమాండ్‌నూ ముందుకు తెస్తున్నారు. ఈ డిమాండ్లు నెరవేరే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఓట్ల తొలగింపు ఆరోపణలపై ఉమ్మడి కార్యాచరణ గురించి చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దసరా తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కూటమి భావిస్తున్నట్లు సమాచారం. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో నవంబర్ 1న భారీ సభ నిర్వహించే అవకాశాన్ని కూడా నేతలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు నిర్వహించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఓటర్ల జాబితాల అంశాన్ని జాతీయ స్థాయి ఉద్యమంగా మార్చాలన్నది కూటమి వ్యూహంగా కనిపిస్తోంది.

**నిరసనలకు వేదికలపై వివాదం**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాల నిర్వహణకు విధించిన ఆంక్షలపై కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కులని వారు పేర్కొంటున్నారు. నిరసనలకు అనువైన వేదికలు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక వేదికపై ఆంక్షలు విధిస్తే దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఆందోళనలు చేపడతామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సభను కేవలం రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా కాకుండా దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా నిర్వహించాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. మరోవైపు, రాహుల్ గాంధీపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన వస్తుండటంతోనే బీజేపీ విమర్శలకు దిగుతోందని ఆయన పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శల తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయి. ఓటర్ల జాబితాల అంశాన్ని ముందుకు తెస్తూనే తమ అగ్రనేతలపై వస్తున్న విమర్శలకు సమాధానం ఇవ్వడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని కాంగ్రెస్ భావిస్తోంది.

**పార్టీ బలోపేతంపై గురి**

హైదరాబాద్‌లో ప్రతిపాదిత సభ ద్వారా జాతీయ స్థాయిలో ఓటర్ల జాబితాల అంశాన్ని చర్చకు తీసుకురావడంతో పాటు తెలంగాణలో పార్టీ సంస్థాగత బలాన్ని ప్రదర్శించాలన్నది కాంగ్రెస్ నాయకత్వం ఆలోచనగా కనిపిస్తోంది. లక్ష మందిని సమీకరించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం, జిల్లాల వారీగా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడం, జాతీయ నాయకుల పర్యటనలను విజయవంతం చేయడం వంటి అంశాలు రాష్ట్ర నాయకత్వానికి కీలకంగా మారనున్నాయి. సభలో ఎన్నికల ప్రక్రియపై విపక్షాల అభ్యంతరాలు, ఎన్నికల సంఘం నుంచి కోరుతున్న చర్యలు, దేశవ్యాప్త నిరసనల కార్యాచరణ ప్రధానంగా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ నెల 24న సభ నిర్వహణ, వేదిక ఎంపిక, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా జాతీయ నేతల హాజరు, జనసమీకరణపై అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే తుది స్పష్టత రానుంది. ఓటర్ల జాబితాల అంశంపై విపక్షాల డిమాండ్లు, ఎన్నికల సంఘం అధికారిక వివరణలు, రానున్న రోజుల్లో చేపట్టే ఉద్యమాలే ఈ రాజకీయ పరిణామాల్లో కీలకంగా మారనున్నాయి.

# సర్వే నంబర్ల మాయాజాలం!

- కాశీబుగ్గలో 624ను 527గా మార్చిందెవరు?
- ఏడీ సర్వే ఒకటి.. డీసీ నోటీసు మరొకటి
- 2021లో రద్దయిన నంబర్ మళ్లీ తెరపైకి ఎలా?
- 12 ఏళ్లుగా ఒకే సర్కిల్‌లో ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్
- అధికారుల డిజిటల్ కీలన్నీ ఆయన చేతిలోనేనా?
- లక్ష్మీకాంత్ కాలనీలో డోజర్ కలకలం.. కేసు నమోదు





**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ఒకే స్థలానికి రెండు సర్వే నంబర్లు.. ఒకే వ్యవహారంపై అధికారుల నుంచి పరస్పర విరుద్ధమైన సంకేతాలు.. 2021లో తప్పుగా నిర్ధారించి రద్దు చేసిన నంబర్ మళ్లీ తెరపైకి రావడం.. 12 ఏళ్లుగా ఒకే కార్యాలయంలో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్ పాత్రపై అనుమానాలు.. ఇవన్నీ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని వివాదాల్లోకి నెడుతున్నాయి. పైడిపల్లి శివారు కత్తెరశాల లక్ష్మీకాంత్ కాలనీలోని 600 గజాల స్థల వివాదం ఇప్పుడు తీవ్ర రూపం దాల్చింది. సర్వే నంబర్ 624/1/2కు చెందిన స్థలాన్ని 527/బి కింద చూపించడంపై బాధితులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఈ గందరగోళం మధ్య తమ స్థలంలోకి డోజర్ తీసుకొచ్చి గోడలు కూల్చివేశారని ఓ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం కేసు దాకా వెళ్లింది. దీనిపై 'ఉత్తరం కాకతీయ' గతంలో వరుస కథనాలు ప్రచురించినా సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం. ముగ్గురు కొనుగోలుదారులు.. మూడు ప్లాట్లు లక్ష్మీకాంత్ కాలనీలోని 600 గజాల స్థలాన్ని 2021లో నీలారపు మంజుల, పెండెం రాజు, పల్లె కుమారస్వామి తలా 200 గజాల చొప్పున కొనుగోలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. మంజుల ప్లాట్‌కు ఇంటి నంబర్ 4751395/1/4, పెండెం రాజు ప్లాట్‌కు 1/3, పల్లె కుమారస్వామి ప్లాట్‌కు 1/5గా పేర్కొంటున్నారు. కొనుగోలు చేసినప్పటి నుంచి మ్యుటేషన్ చేయించుకుని, ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు వివరిస్తున్నారు. ఇన్నాళ్లుగా తమ ఆధీనంలో ఉన్న స్థలంపై ఇప్పుడు హక్కుల వివాదం తెరపైకి రావడంతో మూడు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. స్థలం సర్వే నంబర్ విషయంలోనే అసలు వివాదం మొదలైంది. తమ స్థలం 624/1/2 పరిధిలో ఉందని బాధితులు చెబుతున్నారు. ఇటీవల 14 మంది సమక్షంలో జరిగిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ సర్వేలోనూ ఇదే విషయం నిర్ధారణ అయినట్లు వారు పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఆధారంగా చూపిస్తున్నారు. అయితే కాశీబుగ్గ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి ఇటీవల జారీ అయిన నోటీసుల్లో మాత్రం అదే స్థలాన్ని 527/బి సర్వే నంబర్‌గా పేర్కొన్నట్లు బాధితులు చెబుతున్నారు. ఈ నంబర్ ఆధారంగా రామసహాయం వెంకట్‌రెడ్డికి హక్కు ఉందనే వాదన తెరపైకి రావడంతో తమ ఇంటి నంబర్లను తొలగించే ప్రక్రియ మొదలైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**2021లో రద్దయిన నంబర్ మళ్లీ ఎలా వచ్చింది?**

ఈ వివాదం గతంలోనూ తలెత్తినట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. 2021లో కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన జోనా ఇరువర్గాల పత్రాలను పరిశీలించారని చెబుతున్నారు. అప్పట్లో 624/1/2 సరైన సర్వే నంబర్‌గా నిర్ధారించి, 527/బి తప్పుడు నంబర్‌గా పేర్కొంటూ, ఆ నంబర్ ఆధారంగా జారీ చేసిన ఇంటి నంబర్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఆ ఉత్తర్వుల కాపీ తమ వద్ద ఉందని చెబుతున్నారు. అయితే అప్పట్లో రద్దయిన నంబర్ మళ్లీ 202526లో ఎలా తెరపైకి వచ్చిందన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. పాత ఉత్తర్వుల తర్వాత ఏయే మార్పులు జరిగాయి? సర్వే నంబర్ మార్పునకు సంబంధించి ఏ అధికారి ఆదేశాలు ఇచ్చారు? ఫైల్‌పై ఎవరి సంతకాలు ఉన్నాయి? పాత రికార్డులను పరిశీలించకుండానే కొత్త నోటీసులు జారీ చేశారా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని బాధితులు కోరుతున్నారు.

**12 ఏళ్లుగా ఒకే చోట ఆపరేటర్!**

కాశీబుగ్గ సర్కిల్‌లో 2014 నుంచి ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్‌గా సతీష్ కొనసాగుతున్నారని బాధితులు, స్థానిక వర్గాలు చెబుతున్నాయి. డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మారుతున్నా ఆయన మాత్రం అదే కార్యాలయంలో కొనసాగుతున్నారనే అంశం చర్చకు దారితీస్తోంది. డీసీ నుంచి ఆర్ఐ స్థాయి వరకు అధికారుల డిజిటల్ లాగిన్‌లు, కీలపై కూడా ఆయనకు నియంత్రణ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. డిజిటల్ లాగిన్‌లను ఎవరు వినియోగిస్తున్నారు? ఏ అధికారి అనుమతితో ఫైళ్లలో మార్పులు చేస్తున్నారు? సర్వే నంబర్ల మార్పులకు సంబంధించిన డిజిటల్ రికార్డుల్లో ఏవైనా మార్పులు జరిగాయా? అన్నది పరిశీలించాల్సి ఉంది. కార్యాలయంలో ఒకే వ్యక్తి దీర్ఘకాలంగా కొనసాగుతున్న అంశంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, విధుల విభజనతో పాటు డిజిటల్ వ్యవస్థల వినియోగంపై సమీక్ష నిర్వహించాలని బాధితులు కోరుతున్నారు.

**'కలెక్షన్ రాజ్యం'**

సర్కిల్ కార్యాలయంలో ఫైళ్ల పరిష్కారం కోసం మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సక్రమమైన పనికి ఒక రేటు, నిబంధనలకు విరుద్ధమైన పనికి మరో రేటు అన్నట్లుగా వ్యవహారం సాగుతోందని కొందరు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాల పేరుతో వసూళ్లు జరుగుతున్నాయన్న విమర్శలు ఉద్యోగ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుత డీసీ ప్రసన్నరాణి అండతోనే ఈ వ్యవహారాలు సాగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ, రికార్డుల పరిశీలన లేకుండా నిర్ధారణకు రావడం సాధ్యం కాదు. అయినప్పటికీ, కార్యాలయ పనితీరు, ఫైళ్ల కదలిక, డిజిటల్ లావాదేవీలపై పారదర్శక విచారణ జరపాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. సర్వే నంబర్ వివాదం కొనసాగుతుండగానే లక్ష్మీకాంత్ కాలనీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తన 200 గజాల స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి డోజర్‌తో గోడలు కూల్చివేశారని నీలారపు మంజుల హన్మకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థలాన్ని 527/బి సర్వే నంబర్‌గా చూపిస్తూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఫిర్యాదుపై అక్టోబర్ 12న ఎఫ్ఐఆర్ నంబర్ 479/2026తో కేసు నమోదైందని, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారని కథనంలో పేర్కొన్నారు. స్థల హక్కులు, సర్వే నంబర్లపై ఉన్న వివాదం ఒకవైపు కొనసాగుతుండగా, గోడల కూల్చివేతపై నమోదైన కేసు మరోవైపు విచారణకు వచ్చింది.

**ప్రత్యేక అధికారి జోక్యానికి డిమాండ్**

మూడు కుటుంబాలు అప్పులు చేసి స్థలాలు కొనుగోలు చేశామని, పన్నులు చెల్లిస్తూ వస్తున్నామని బాధితులు చెబుతున్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ సర్వేలో తమ స్థలం 624/1/2గా తేలినట్లు చెబుతుంటే, డీసీ కార్యాలయం నుంచి 527/బి పేరుతో నోటీసులు రావడం తమను అయోమయానికి గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, కోర్టుకు వెళ్లాలని చెప్పి అధికారులు బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారని వారు విమర్శిస్తున్నారు. తమ మధ్య వివాదం సృష్టించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ జోక్యం చేసుకోవాలని బాధితులు కోరుతున్నారు. 624/1/2 సర్వే నంబర్‌ను 527/బిగా చూపించిన ఫైల్‌ను బయటకు తీసి పరిశీలించాలని, సంబంధిత మార్పులకు బాధ్యులెవరో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. 12 ఏళ్లుగా ఒకే సర్కిల్‌లో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్ పాత్ర, అధికారుల డిజిటల్ లాగిన్‌ల వినియోగం, రికార్డుల్లో మార్పులు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరపాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారుల అధికారిక స్పందన కోసం 'ఉత్తరం కాకతీయ' ప్రయత్నిస్తోంది. పాత ఉత్తర్వులు, తాజా సర్వే నివేదిక, డీసీ కార్యాలయ నోటీసులు, సంబంధిత డిజిటల్ రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తేనే 624/1/2 నుంచి 527/బి వరకు జరిగిన పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు మూడు కుటుంబాల స్థల హక్కుల వివాదానికి తెరపడే పరిస్థితి కనిపించడం లేదు.



## మచ్చాపూరంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- ఓవర్‌లోడ్ సమస్యకు పరిష్కారం
- 100 కేవీఏకు అదనంగా మరో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- సర్పంచ్ మానస ప్రకాష్ చొరవతో విద్యుత్ శాఖ చర్యలు

**కాకతీయ, గీసుగొండ:** మచ్చాపూరంలో విద్యుత్ సరఫరా సమస్యలను తగ్గించి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక భారం పడుతుండటంతో ఓవర్‌లోడ్ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మచ్చాపూర్ డిస్ట్రిబ్యూషన్ పరిధిలోని ఎస్ఎస్ 16 వద్ద ఇప్పటికే ఉన్న 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఛార్జింగ్ చేశారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌తో ఓవర్‌లోడ్ సమస్య తగ్గి విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు. సాగు అవసరాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవడం రైతులకు ప్రయోజనకరమని తెలిపారు. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సర్పంచ్ మానస ప్రకాష్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ బి. రవి, ఏఈ ఆర్. సందీప్ కుమార్, సర్పంచ్ మానస ప్రకాష్, రైతులు బొల్లి ప్రభాకర్, మర్రి కుమార్, సంగనేని కృష్ణ, నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే

- దుర్గామాత నవరాత్రుల సందర్భంగా మహిళలకు కోలల పంపిణీ
- సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం
- ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎద్దండి రాజు




**కాకతీయ, వేములవాడ:** దుర్గామాత ఆశీస్సులతో ప్రజలకు సేవ చేయడం, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎద్దండి రాజు అన్నారు. దుర్గామాత నవరాత్రుల సందర్భంగా వేములవాడ పట్టణంలోని గాంధీనగర్ దుర్గామాత మండపం వద్ద ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కోలల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకుడు పిల్లి బాబురావు మాట్లాడుతూ మహిళా భక్తులకు కోలలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా ఎన్నారై దాతలు తాడూరి లక్ష్మి, మహేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దాత తాడూరి మహేష్ మాట్లాడుతూ ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు తమ సహకారం కొనసాగుతుందని పేర్కొన్నారు. సమాజ హితం కోసం ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎద్దండి రాజు, సరళ, వేముల సతీష్, సంద్రగిరి రాజేష్ గౌడ్, గోంటి నవీన్, వాసాల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

- డ్రిప్ పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించాలి
- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రధాన కంపెనీల విత్తనాలు, ఎరువుల నిల్వలపై ఆరా



**కాకతీయ, జనగామ :** రైతులకు వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం పాలకుర్తి మండలం ముత్తారం గ్రామంలోని మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి అక్కడి సేవలు, వ్యవసాయ ఉత్పాదకాలు, పరికరాలు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. రైతులకు అవసరమైన డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉన్నాయా, ఇప్పటివరకు ఎంతమందికి పంపిణీ చేశారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్కువ నీటితో సమర్థవంతంగా సాగునీరు అందించేందుకు డ్రిప్ విధానం ఉపయోగకరమని, రైతులకు దీనిపై అవగాహన కల్పించి వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రధాన కంపెనీలకు చెందిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయా, వాటి విక్రయాలు ఎలా జరుగుతున్నాయనే అంశాలను పరిశీలించారు. ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు, విక్రయాలపై ఆరా తీశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలు వ్యవసాయ రంగంలో భాగస్వాములవుతూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, ఎంపీడీవో వేదవతి, ఏడీఏ అపర్ణ, ఎంపీఓ మల్లికార్జున, ఎంఏఓ విద్యాసాగర్, ఏఈఓ మహేష్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

- పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నాం
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**కాకతీయ, పరకాల:** పార్టీలకు అతీతంగా అర్హులైన పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అండగా నిలుస్తున్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుగొండ మండలాలతో పాటు 15, 16 డివిజన్ల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంపన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇందిరా మహిళా డెయిరీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ.500 బోనస్, సన్న బియ్యం పంపిణీ, మహాలక్ష్మి, గ్యాస్ సబ్సిడీ, వడ్డీలేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.





హన్మకొండ డీఈవో కార్యాలయం ప్రాంగణంలో బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు

## కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- సంప్రదాయ పాటలతో మహిళా ఉద్యోగుల సందడి
- బతుకమ్మలను అభినందించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్







**కాకతీయ, హనుమకొండ:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. టీఎన్జీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆడిపాడారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మహిళా ఉద్యోగులు రూపొందించిన బతుకమ్మలను పరిశీలించి, వాటి అందాన్ని ప్రశంసించారు. బతుకమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఉద్యోగులను అభినందించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబరాలతో పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

## సమాజ భద్రతకు దాతల చేయూత

- కాకతీయ కథనానికి కదిలిన పోలీసు యంత్రాంగం
- రాయపర్తి లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కదులుతున్న అడుగులు
- రూ.20,000 విరాళం అందించిన మహాలక్ష్మి చికెన్ సెంటర్ యజమాని చెన్నబోయిన రవి
- ఆర్థిక సహాయం అందించి ఆదర్శంగా నిలిచిన రవిని అభినందించిన స్థానికులు








**కాకతీయ,రాయపర్తి :** మండల కేంద్రంలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణే ధ్యేయంగా సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది.ఆగస్టు 5న ఉత్తరం కాకతీయ దినపత్రికలో 'మూడో కన్ను లేక మూగబోయిన భద్రత ' శీర్షికన కథనం వెలువడింది.ఈ ప్రత్యేక శీర్షికతో వచ్చిన వార్త కథనం స్థానిక పోలీసు యంత్రాంగంలో కదలికను తీసుకొచ్చింది.తక్షణమే స్పందించిన రాయపర్తి ఎస్సై ముత్యం రాజేందర్ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పోలీసు శాఖ పిలుపునకు, కాకతీయ దినపత్రిక చొరవకు స్పందించి స్థానిక వ్యాపారస్తులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు .ఈ క్రమంలో మండల కేంద్రానికి చెందిన మహాలక్ష్మి చికెన్ సెంటర్ యజమాని, మహబూబ్ నగర్ గ్రామ ఉపసర్పంచ్ చెన్నెబోయిన రవి రూ.20,000 ఆర్థిక విరాళాన్ని బుధవారం ఎస్సైకి అందజేశారు.ఈ సందర్భంగా దాత చెన్నెబోయిన రవి మాట్లాడుతూ..గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల నేరాలు,దొంగతనాలు గణనీయంగా తగ్గుతాయని అన్నారు.మహిళల భద్రతకు 'మూడో కన్ను'(సీసీ కెమెరాలు)ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఎస్సై పిలుపునకు స్పందించి ఈ విరాళం అందించినట్లు ఆయన తెలిపారు.ఆర్థిక సాయం అందించి ఆదర్శంగా నిలిచిన చెన్నెబోయిన రవిని ప్రజాప్రతినిధులు,స్థానిక ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.సమాజ శ్రేయస్సు కోసం మిగతా వ్యాపారులు,దాతలు కూడా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటుకు తమ వంతు సహకారం అందించాలని ఎస్సై రాజేందర్ కోరారు.

## బాలికలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- సోషల్ మీడియాలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి
- సైబర్ వేధింపులపై భయపడకుండా ఫిర్యాదు చేయాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పిలుపు




**కాకతీయ, హన్మకొండ :** బాలికలు తమ హక్కులు, రక్షణపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని, సైబర్ వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా షీ టీమ్స్ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో బాలికా సంఘాలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్స్ ఏసీపీ సదయ్య నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలికల భద్రత, మహిళా రక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, సైబర్ నేరాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

**సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి**

ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ కౌమార దశలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా అధిగమిస్తూ జీవిత లక్ష్యాలను సాధించాలని బాలికలకు సూచించారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు మానసిక, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవాలని, అవసరమైనప్పుడు షీ టీమ్స్ సహాయం పొందాలని తెలిపారు. సైకాలజిస్ట్ డాక్టర్ బారుపాటి గోపి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రత్యేక సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను విచక్షణతో వినియోగిస్తూ సైబర్ మోసాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్. రాధిక మాట్లాడుతూ కౌమార దశలో కలిగే శారీరక, మానసిక మార్పులపై అవగాహన కలిగి ఉండాలని, సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. బాలికల భద్రత, సాధికారత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అదనపు డీసీపీలు బాలస్వామి, ఏసీపీలు సదయ్య, వెంకటరమణ, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ ఓ. రమేష్, భరోసా కేంద్రం ఎస్ఐ కిరణ్మయి, షీ టీమ్స్ ఆర్ఎస్ఐ స్వాతి, ఎస్ఐ రామారావు తదితర పోలీస్ అధికారులు, తొమ్మిది మండలాల బాలికలు, మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## విదేశీ విద్యానిధికి గడువు పొడిగింపు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి (ఫాల్ సీజన్ 2026) దరఖాస్తుల గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించినట్లు వరంగల్ బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఇది మంచి అవకాశం అని, కుటుంబ ఆదాయం రూ. 5 లక్షల లోపు, వయస్సు 35 ఏళ్ల లోపు ఉండాలని, డిగ్రీలో 60 శాతం మార్కులతో పాటు జీఆర్ఈ / జీమ్యాట్, టోఫెల్ / ఐఈఎల్టీఎస్ / పీటీఈ అర్హత ఉండాలని తెలిపారు. వివరాలకు www.telanganaepass.cgg.gov.in చూడాలన్నారు.

# లో వోల్టేజీతో రైతులకు కష్టాలు!

- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి
- బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ డిమాండ్



**కాకతీయ, చందుర్తి :** విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం, లో వోల్టేజీ సమస్యలతో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చందుర్తి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తక్కువ వోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు, వైరింగ్ కాలిపోతున్నాయని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని విజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గొలుసుకట్టు చెరువుల్లో నీరు లేక సాగునీటి సమస్య మరింత తీవ్రమైందని, పంటలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అల్లాడి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మార్త సత్తయ్య, మండల ప్రధాన కార్యదర్శులు మర్రి మల్లేశం, మూడపెల్లి ముఖేష్, చిలుమల హనుమయ్య చారి, పత్తిపాక శ్రీనివాస్, ఎగుమతి శ్రీనివాస్‌రెడ్డి, మారుపాక దేవయ్య, హాజీమెరా రవినాయక్, యువ మోర్చా మండల అధ్యక్షుడు మొత్కుపల్లి రాజశేఖర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు చింతకుంట సాగర్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు పాటి సుధాకర్, మండల కార్యదర్శి ఎగోలపు గణేష్‌తో పాటు బుర్ల రెడ్డి, రాజు, సురేష్, జలగం శ్రీనివాస్, మేఘన రావు, పొన్నాల మహేందర్, వెంకటేష్, అయోధ్య పర్షాములు, తిరుపతి, ఎల్లయ్య, నవీన్, కృష్ణస్వామి, సింగం రాకేష్, ప్రమోద్, శేఖర్, రంబాబు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దాపూర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

- రూ.9.95 కోట్ల నిధుల కేటాయింపు.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి సర్పంచ్ ఎలుకటి రవి కృతజ్ఞతలు



**కాకతీయ, ఆత్మకూరు:** పెద్దాపూర్ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.9.95 కోట్ల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ పాఠశాల మంజూరైందని గ్రామ సర్పంచ్ ఎలుకటి రవి తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో పెద్దాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆధునిక విద్యా సదుపాయాలతో పాఠశాల అందుబాటులోకి వస్తే గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెద్దాపూర్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ ఎలుకటి రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ కోతలపై బీఆర్ఎస్ రాస్తారోకో

- రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి
- కోతలతో ఎండిపోతున్న పంటలు
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య ఆధ్వర్యంలో నిరసన



**కాకతీయ, పెద్దవంగర:** వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డేకొత్తపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం కనీసం 5 నుంచి 6 గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని విమర్శించారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరైన సమయంలో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పొలాల్లో భూమి బీటలు వారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, సీనియర్ నాయకులు రామచంద్రయ్య శర్మ, సుధీర్, సంజయ్, భాస్కర్, సుధాకర్, వెంకన్న, పటేల్ నాయక్, కవిత యాకన్న, రాము, వెంకట్‌రెడ్డి, శంకర్, యాకన్న, రవి, సమ్మయ్య, పూర్ణచందర్, గంగాధర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- జగన్నాథపల్లిలో భూముల రీ సర్వేపై అవగాహన సదస్సు
- వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ ఎల్.కిషోర్ కుమార్



**కాకతీయ,రాయపర్తి :** రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ)ఎల్.కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని జగన్నాథపల్లి గ్రామంలో సర్పంచ్ బద్దం సుగుణమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ,అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సభలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించే భూముల రీసర్వే ద్వారా ప్రతీ రైతుకు వారి భూమికి సంబంధించిన స్పష్టమైన హక్కులు, పక్కా కొలతలతో కూడిన రికార్డులు లభిస్తాయని అన్నారు.సర్వేలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ భూముల సరిహద్దులను సరిచూసుకోవాలని,ఈ ప్రక్రియలో రైతులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి శ్రీనివాసులు,ఆర్డీఓ టి.సుమ,తహసిల్దారు ముల్కనూరి శ్రీనివాస్,ఎంపీడీవో పాక శ్రీనివాసులు,ఎంఆర్ఐ కొయ్యాడ చంద్రమోహన్, ఏఆర్ఐ సంధ్యారాణి,సర్వేయర్లు,జిపిఓలు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- విద్యార్థి దశ నుంచే క్రీడల్లో శిక్షణ ఇప్పించాలి
- నగర పోలీస్ కమిషనర్ శ్వేత



**కాకతీయ, హనుమకొండ, అక్టోబర్ 14:** విద్యార్థి దశ నుంచే పిల్లలకు క్రీడల్లో శిక్షణ ఇప్పించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని అన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో ములుగు రోడ్డులోని ఎల్‌బీ కళాశాలలో నిర్వహించనున్న మినీ సబ్ జూనియర్ బాలుర ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి. సాంబశివరావు బుధవారం సీపీ శ్వేతకు వినతిపత్రం అందజేశారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి బాలుర జట్లు పాల్గొంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎనుమాముల మార్కెట్‌కు 5 రోజులు సెలవులు

- ఈ నెల 17 నుంచి 21 వరకు బంద్
- 22 నుంచి యథావిధిగా మార్కెట్ పునఃప్రారంభం
- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పులి ప్రియాంక ప్రకటన




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** దసరా పండుగ నేపథ్యంలో వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 5 రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పులి ప్రియాంక తెలిపారు. ఈ నెల 17 నుంచి 21 వరకు మార్కెట్ బంద్ ఉంటుందని, తిరిగి 22వ తేదీ గురువారం నుంచి యథావిధిగా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ నెల 17న శనివారం యార్డులు బంద్ కాగా, 18న ఆదివారం వారాంతపు సెలవు, 19న సోమవారం మొహర్రం, 20న మంగళవారం విజయదశమి, 21న బుధవారం విజయదశమి మరుసటి రోజు సందర్భంగా సెలవులు ఉంటాయని వివరించారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సెలవు రోజుల్లో తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువచ్చి ఇబ్బందులు పడవద్దని పులి ప్రియాంక కోరారు. మార్కెట్ కమిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యే నాయినికి కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు

- కాజీపేటకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరుపై హర్షం
- రూ.10 కోట్ల అంచనా వ్యయంతో పాఠశాల అభివృద్ధి
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు



**కాకతీయ, కాజీపేట :** కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కాజీపేట కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సత్కరించారు. కాజీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ పాఠశాల ఏర్పాటుతో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని, ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కాజీపేట అభివృద్ధితోపాటు ప్రజల అవసరాలను గుర్తించి పాఠశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కాజీపేట ప్రజలు, కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పసునూరి మనోహర్, మాజీ కార్పొరేటర్ అబుబకర్, విజయశ్రీ రజాలి, సుంచు అశోక్, ఎన్ఎస్‌యూఐ మాజీ జాతీయ కోఆర్డినేటర్ రహమతుల్లా మహమ్మద్, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, బుర్ర బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

- ఎల్‌నినో ఎఫెక్ట్‌తో పెరగనున్న విద్యుత్ డిమాండ్
- నిరంతర సరఫరాకు విద్యుత్ శాఖ ముందస్తు కసరత్తు
- టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి
- ములుగు సర్కిల్‌లో సబ్‌స్టేషన్ల నిర్వహణపై సీఎండీ సమీక్ష



**కాకతీయ, ములుగు:** ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వ్యవసాయ అవసరాలతోపాటు ఏసీలు, కూలర్ల వినియోగం అధికం కావడంతో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉందని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు సర్కిల్ పరిధిలోని కమలాపూర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌తోపాటు మంగపేట, మల్లూరు, అబ్బాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. నిర్వహణ, పరికరాల పనితీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షించారు. అనంతరం ములుగులోని ఎస్‌పీఎం షెడ్‌ను పరిశీలించారు. విద్యుత్‌కు గరిష్ఠ డిమాండ్ ఉండే సమయాల్లో అంతరాయాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధ్యమైన చోట లైన్ క్లియరెన్స్ పనులను సాయంత్రం వేళల్లోనే ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. 11 కేవీ ఫీడర్లలో లోపాలు తలెత్తితే సిబ్బంది వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలని, అనవసరంగా లైన్ క్లియరెన్స్‌లు తీసుకోవద్దని స్పష్టం చేశారు. దెబ్బతిన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను (డీటీఆర్) తక్షణమే మార్చి, విద్యుత్ అంతరాయాలతో రైతుల పంటలకు నష్టం కలగకుండా చూడాలని ఆదేశించారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ములుగు సర్కిల్ ఎస్ఈ బిక్షపతి, ములుగు డీఈ రాజు, ఏటూరునాగారం ఏడీఈ, ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ నియంత్రణకు 95-95-95 లక్ష్యాలు సాధించాలి

- మిషన్ ఎయిడ్స్ సురక్ష అమలులో జిల్లా స్థాయి పర్యవేక్షణ కీలకం
- హ్యాండ్‌బుక్‌లు, వీడియోలతో విస్తృత అవగాహన కల్పించాలి
- నాకో డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా సూచన

**కాకతీయ, జనగామ :** హెచ్ఐవీ వ్యాప్తిని తగ్గించడంతోపాటు వైరస్ సోకిన వారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించేందుకు నిర్దేశించిన 959595 లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) డైరెక్టర్ జనరల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేష్ గుప్తా సూచించారు. బుధవారం ఢిల్లీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం అమలు, లక్ష్యాలు, ఆశించిన ఫలితాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక హ్యాండ్‌బుక్‌ను అందుబాటులో ఉంచినట్లు డాక్టర్ రాకేష్ గుప్తా తెలిపారు. ఇంగ్లిష్, హిందీ, తెలుగు, కన్నడ భాషల్లో రూపొందించిన వీడియోల ద్వారా క్షేత్ర స్థాయి సిబ్బందికి స్పష్టత కల్పించాలని సూచించారు. ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర భాగస్వాముల సమన్వయంతో జిల్లా స్థాయిలో కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ తల్లులు, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రక్తదాన శిబిరాలను విస్తృతంగా నిర్వహిస్తూ రక్త పరీక్షల సంఖ్య పెంచాలని, రక్తదానం, రక్త పరీక్షల ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ప్రోగ్రామింగ్ అధికారి మల్లికార్జున రావు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

- కేసీ వేణుగోపాల్‌కు డాక్టర్ రామకృష్ణ వినతి
- పార్టీ సేవలు, రాజకీయ ప్రస్థానంతో బయోడేటా అందజేత



**కాకతీయ, హన్మకొండ :** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే పేదలకు మరింత విస్తృతంగా సేవలందిస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్‌ను కలిసి తన అభ్యర్థనను వివరించారు. పార్టీ కోసం విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ నుంచి పనిచేసిన ప్రస్థానం, రాజకీయ అనుభవం, ప్రజాసేవ వివరాలతో కూడిన బయోడేటాను కేసీ వేణుగోపాల్‌కు అందజేశారు. కాంగ్రెస్ అధిష్ఠానంపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులను నాయకత్వం గుర్తిస్తుందనే నమ్మకం ఉందని రామకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. తన సేవలను, రాజకీయ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు నిరంతరం కృషి చేస్తున్న నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. పదవులు బాధ్యతతో కూడుకున్నవని, అవకాశం లభిస్తే ప్రజాసేవను మరింత విస్తృతం చేస్తానని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన నాయకులకు సముచిత ప్రాధాన్యం కల్పించడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతమవుతుందని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అభిప్రాయపడ్డారు.

## శంకరాజుపల్లిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**కాకతీయ, ఏటూరునాగారం:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. తుపాకులగూడెం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పక్కన తిరుగురాళ్ల సమీపంలోని పొదల్లో మృతదేహాన్ని గుర్తించారు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో అనుమానంతో అటువైపు వెళ్లి పరిశీలించగా మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఏటూరునాగారం ఎస్ఐ బి. మహేష్‌కు ఘటన గురించి తెలియజేశారు. మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## పట్టభద్రుల ఓటు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలి
- ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు పిలుపు



**కాకతీయ, ములుగు :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు పిలుపునిచ్చారు. గతంలో ఓటు ఉన్నవారు సైతం నిబంధనల ప్రకారం ఫారం-18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ ధ్రువపత్రాన్ని జతచేసి ఫారం-18ను తహసీల్దార్ లేదా ఆర్డీవో కార్యాలయాల్లో సమర్పించవచ్చని, ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తులో ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. నవంబర్ 6 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని, నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా, డిసెంబర్ 30న తుది జాబితా ప్రకటించనున్నట్లు వివరించారు. అర్హులైన పట్టభద్రులు గడువులోగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాలు, మండలాల వారీగా పట్టభద్రులను చైతన్యపరిచి ఓటు నమోదు ప్రక్రియలో సహకరించాలని లక్ష్మణ్‌బాబు సూచించారు.

## స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ అశోక్ కు సన్మానం



**కాకతీయ, దుగ్గొండి :** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన అంతర్జాతీయ రెజ్లింగ్ కోచ్ గుగులోతు అశోక్ కుమార్ ను ఉమ్మడి వరంగల్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ తరుపున సన్మానించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియం లో అశోక్ కుమార్ ను ఉమ్మడి వరంగల్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదగిరి సుధాకర్ గారు సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దుగ్గొండి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అయిన గుగులోతు అశోక్ కుమార్ అంచెలంచెలుగా డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి ఎదిగి అందరికి ఆదర్శంగా నిలిచినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

## భగీరథ పైప్ లైన్ లీకేజీ



**కాకతీయ, దుగ్గొండి :** మండల కేంద్రంలోని ఏడవ వార్డ్ లో కొన్ని రోజుల నుండి మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ అవటం వల్ల నీరు వృధాగా రోడ్డు పైన వరదల పారుతుందని, రోడ్డు మీద వెళ్లే వాహనాల వల్ల బురద గుంత ఏర్పడి ఇబ్బంది కలుగుతుందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం ఎల్ ని వో వల్ల ప్రజలు నీళ్లను పొదుపుగా వాడుకోవాలని ప్రకటనలు ఇస్తున్నప్పటికి ఆచరణలో అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికయినా మిషన్ భగీరథ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేయాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266